5న సామర్లకోటకు సిఎం జగన్ రాక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అక్టోబర్ 5న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సామర్లకోటకు వస్తున్నట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు తెలిపారు. సామర్లకోట పట్టణంలో నవరత్నాలు పథకంలో భాగంగా అందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇటిసి జగనన్న లేఔట్‌లో సామూహిక గృహప్రవేశ కార్యక్రమాలను ఆయన చేపడుతున్నట్టు చెప్పారు. కొన్ని అవాంతరాల కారణంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పర్యటన వాయిదా పడుతూ వచ్చిందన్నారు. ప్రస్తుతం అక్టోబర్ 5న ఆయన పర్యటన ఖరారైనట్టు తెలిపారు. తొలుత అందరికీ ఇళ్లు ప్రారంభించి తదుపరి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో బహిరంగ సభలో సిఎం జగన్ ప్రసంగిస్తారన్నారు.

ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధం ఆపాలి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా ఉద్యమాలపట్ల పోలీసుల వైఖరి మార్చుకోవాలని, రాజ్యాంగం ప్రకారం పని చేయాలని, రాజ్యాంగం కల్పించిన నిరసన తెలియజేసే హక్కుని కాపాడాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో టీచర్స్ హోమ్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి అధ్యక్షతన శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్లూరి వెంకటేశ్వరరావు, ఎఐసిటియు ఎపి అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాడ్డూరి రాజు, ఎఐసిసిటియు రాష్ట్ర కార్యదర్శి గొడుగు సత్యనారాయణ, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు గుబ్బల ఆదినారాయణ, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు అంజిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పౌర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల రవాణా శాఖ మంత్రికి వినతిపత్రం ఇచ్చే సందర్భంలో అంగన్వాడి కార్యకర్తల విజయవాడ ధర్నా, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ వామపక్షాల శాంతియుత ఆందోళన చేస్తున్న సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఉద్యమకారుల పట్ల వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతరకరమన్నారు. తక్షణం రాజ్యాంగ హక్కులకు విరుద్ధంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై పురుష పోలీసులు అసభ్యకరమైన రీతిలో భౌతిక దాడులకు దిగుతున్న ఘటనల పట్ల జిల్లా అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే కాకినాడ ప్రాంతంలో నిత్యకృత్యంగా ప్రజా ఉద్యమాలపై పోలీసు పైశాచికత్వం పెరిగిందన్నారు. వీరికి స్థానిక అధికార పార్టీ నుండి సంపూర్ణ అండదండలు అందుతున్నాయి కాబట్టే ఏళ్ల తరబడి బదిలీలు కాకుండా ఒకే ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా పని చేయగలుగుతున్నారని విమర్శించారు. దళితులపై దాడులు, కార్మిక ఉద్యమాలు, రైతాంగ పోరాటాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు జరుగుతున్న సందర్భంలో జగన్ ప్రభుత్వంతోపాటు, పోలీసులు కూడా దోపిడీదారుల పక్షాన వహిస్తు ఉద్యమాల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ప్రజా ఉద్యమాలు జరుగుతుంటే, కాకినాడ జిల్లాలో మాత్రం ఉద్యమాలను నీరు కార్చేందుకు కలెక్టరేట్ వద్ద చట్టవ్యతిరేక నిషేధ ఆజ్ఞలు అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ పద్ధతులే పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్నాయని, ఈ విధానాలకు త్వరలో స్వస్తి పలకడానికి కార్మికులు, రైతులు, దళితులు, ప్రజలు ఐక్య పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. సమస్య తీవ్రతపట్ల జిల్లా ఎస్‌పి తీసుకునే చర్యలను బట్టి భవిష్యత్ కార్యాచరణ అమలుకు సిద్ధపడతామని ఐక్యప్రకటన విడుదల చేశారు. మానవ హక్కుల సంఘానికి, న్యాయ పోరాటానికి కూడా సిద్ధపడుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రమణమ్మ నగర కార్యదర్శి కె.జ్యోతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల ఈశ్వరి ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారెడ్డి, సిపిఐ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడకొండ, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నరాల శివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పప్పు ఆదినారాయణ, దళిత హక్కుల పోరాటసమితి జిల్లా నాయకులు శాఖా రామకృష్ణ, సురేష్, కాశీ విశ్వనాథ్, వేణి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శేష బాబ్జి

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే వైద్యం

మంత్రి దాడిశెట్టి రాజా

ప్రజాశక్తి-కోటనందూరు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్యం చేరువవుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శుక్రవారం తుని పట్టణంలోని మంత్రి కార్యాలయంలో తొండంగి, కోటనందూరు, తుని ఏరియా ఆసుపత్రుల వైద్య బృందాలతోనూ మండల స్థాయి అధికారులతో, ప్రజా ప్రతినిధులతోనూ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతి మారుమూల గ్రామాలలో ప్రతి గడపగడపకు వెళ్లి ప్రతి ఒక్కరికి ప్రాథమిక వైద్య పరీక్షలు ఏడు రకాలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితి ఏ విధంగా ఉందనేది గుర్తిస్తారన్నారు. ఆ గ్రామానికి చెందిన వైద్య సురక్ష టీములో చేర్చాలని వివరించారు. ఇలా చేసినట్లయితే ప్రతి వ్యక్తి యొక్క ఆరోగ్య పరిస్థితిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని అన్నారు. ఇప్పటికే గ్రామస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేశామని వైద్య బృందాలు మండల స్థాయి అధికారులు మంత్రికి వివరించారు. గ్రామాలలో నిర్లక్ష్యంగా ప్రజలను చైతన్యవంతులను చేసి వైద్యులకు సహకరించే దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో లగుడు శ్రీనివాస్, సోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, ఎస్ రాంబాబు, ఎంపిడిఒ ఎస్ఎస్.శర్మ పాల్గొన్నారు.

మంత్రి రాజాకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఆరోగ్య సురక్షపై సిఎం టెలీకాన్ఫరెన్స్

ప్రజాశక్తి -కరప

మండల రెవెన్యూ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై శుక్రవారం సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని ఎంపిడిఒ కె.అప్పారావు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పై ప్రజలలో అవగాహన కల్పించి అవసరమైన వారికి వైద్య సిబ్బంది వైద్యం అందించాలని సిఎం తెలిపారన్నారు. ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచిత వైద్యం అందించి అవసరమైన మందులు ఇవ్వాలన్నారు. మండల కేంద్రమైన కరప జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆరోగ్య సురక్ష క్యాంపు రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ క్యాంపుకు వచ్చేవరకు ఆధార్ కార్డు తీసుకుని రావాలని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల అధ్యక్షుడు చింత ఈశ్వరరావు, అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాస్ నాయక్, అధికారులు, పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలివ్వాలి

ప్రజాశక్తి-కాకినాడ

భూ యజమాని తీసుకున్న అప్పుతో సంబంధం లేకుండా ప్రతి కౌలు రైతుకూ రూ.లక్ష వరకు పంట రుణం ఇవ్వాలని ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కాకినాడ లీడ్ బ్యాంక్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ జిల్లాలో 1,50,000 మంది కౌలు రైతులు ఉన్నప్పటికీ 55 వేల మందికి మాత్రమే కౌలు కార్డులు ఇచ్చారని వీరిలో 30 శాతం మందికి పంట రుణాలు ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కౌలు రైతుకూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇస్తామని నమ్మించి ఇప్పుడు పంట రుణం కోసం బ్యాంకుల వద్దకు పోతే మీరు చేస్తున్న భూమిపై ఇప్పటికే పంట రుణం భూయజమాని తీసుకున్నారని మీకు పంట రుణం రాదని కౌలు రైతులను తిరిగి పంపుతున్నారన్నారు. ఇచ్చిన కొంతమందికైనా రిజర్వు బ్యాంకు గైడ్‌లైన్స్ ప్రకారం ఒక ఎకరాకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.30,000 మించి ఇవ్వాలని, 5 ఎకరాలు చేస్తున్న రైతుకు రూ.1,50,000 ఇవ్వాన్నారు. కానీ రూ.20 వేల నుంచి రూ.30 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. సిసిఆర్సి కార్డు లేకపోయినప్పటికీ ఈ క్రాప్ అయితే పంట రుణం ఇస్తామని చెప్పి ఇప్పుడు సిసిఆర్సి తప్పనిసరి అని బ్యాంకు వారు అంటున్నారని ఇలా అయితే కౌలు రైతులకు పంట రుణాలు రావన్నారు. ఈ సమస్య పరిష్కరించాలన్నారు. గతంలో తాళ్ళరేవు యూనియన్ బ్యాంకులో పోలేకుర్రులో ఒకరిద్దరు వ్యక్తులు బ్యాంకు అప్పు ఎగ్గొట్టిన కారణంగా కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వనని చెప్పడం కరెక్ట్ కాదన్నారు.అనంతరం ఎల్‌డిఎం, ఎజిఎంలను కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన ఎజిఎం చిన్న బాపనపల్లి రైతులకు పంట రుణాలు ఇస్తామని అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి సిహెచ్.సంతోష్, కొంకే సత్యనారాయణ, పెండెం కొండ, బళ్ల భీమారావు, తిరుకోటి కృష్ణ, పంపన నాగేశ్వరరావు, అనుసూరి చిన్న, పెండెం లోవరాజు, పెండెం జాను, పెండం సత్యనారాయణ, తిరుక్కోటి నాని రేవు చిన్నబ్బాయి పాల్గొన్నారు.

లీడ్ బ్యాంకు వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

1న పరిశుభ్రతపై కాకినాడలో స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ ఒకటో తేదీన పరిశుభ్రతపై ప్రజల భాగస్వామ్యంతో ఏక్ తారీఖ్ - ఏక్ ఘంటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ఈ అంశంపై శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాధిపతులు, ప్రత్యేక అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ లో భాగంగా అక్టోబర్ 2 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు చెరువులు, నీటి కుంటలు జన సాంద్రత అధికంగా ఉండే బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు ముఖ్య ప్రాంతాలలోఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

రాజకీయాలతో నిమిత్తం లేని సంక్షేమం

ప్రజాశక్తి-కాకినాడ

రాజకీయాలను, సంక్షేమంతో ముడిపెట్టకుండా అన్ని వర్గాల ప్రజల బాగోగుల కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలుతో కృషి చేస్తున్న ప్రభుత్వం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వమని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా అర్హులైన ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్, ఎండియు డ్రైవర్లకు అయిదో విడతలో రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయవాడలో ప్రారంభించగా ఈ పథకానికి సంబంధించిన జిల్లాస్థాయి కార్యక్రమం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో కాకినాడ సూర్యకళామందిర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, పట్టణ మార్కెగ్ కమిటీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, టిడిసి ఎ.మోహన్, ఆటోయూనియన్ల ప్రతినిధులు, లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ 2019 నుంచి వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం ద్వారా అర్హులైన సొంత ఆటోరిక్షా, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్, ఎండీయూ కలిగిన డ్రైవర్లకు మరమ్మతులు, ఇన్సూరెన్స్ ఖర్చులు వంటి వాటి కోసం ప్రభుత్వం ఏటా పది వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు. కులం, మతం, వర్గం, రాజకీయాలతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గతంలో ఆటో ప్రమాదాలు, క్వారీ లారీ ప్రమాదాలు ఎక్కువగా జరిగేవని ఇప్పుడు ఆ ప్రమాదాలు బాగా తగ్గినట్లు ఎంపీ వంగా గీత తెలిపారు. కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం ద్వారా అయిదో విడతలో 2023-24 సంవత్సరానికి 12,970 మందికి రూ.12.97 కోట్ల మేర లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ఎండా వానా లేకుండా కష్టపడుతూ తమ కాళ్లపై తాము నిలబడుతున్న ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్, ఎండియు డ్రైవర్లకు వైఎస్ఆర్ వాహనమిత్ర పథకంతో ఎంతో మేలు జరుగుతోందన్నారు. అయిదో విడతతో కలుపుకుంటే ఒక్కో లబ్ధిదారునికి మొత్తం రూ. 50 వేలు వరకు పథకం ద్వారా అందిందని ఈ మొత్తాన్ని మరమ్మతులు, ఇన్సూరెన్స్ ఖర్చులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి వాటికోసం ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి విజయవాడలో బటన్ నొక్కి వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని విడుదల చేసిన అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఆటోయూనియన్ల ప్రతినిధులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

చంద్రబాబుకు మద్దతుగా టిడిపి దీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్, రూరల్

రాష్ట్రంలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన కొనసాగిస్తున్నాడని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా సిటీలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. నియోజకవర్గ పరిశీలికలు నాగిడి నాగేశ్వరరావు పాల్గొని దీక్షను ప్రారంభించారు. దీక్షాపరులకు నిమ్మరసం ఇచ్చి వనమాడి కొండబాబు దీక్షను విరమింజేశారు. ఈ కార్యక్రమంలో సీకోటి చక్రధరరావు, జక్కి ప్రసాద్, దడాల అప్పారావు, తలుపులూరి మేరి, కొప్పల రవళి, తాళాబత్తుల గోవిందరావు, వి.భరత్, దారా ప్రసాద్, వరప్రసాద్, పప్పు దుర్గాప్రసాద్, సుధీర్ బాబు, అడ్డాల శ్రీను, జక్కి విజయ్ కుమార్, కట్టా సూర్యనారాయణ, నందిక అబ్బులు, వనమాడి పెద్ద ధర్మారావు, సంగాడి వీరబాబు, కామాడి సుబ్బారావు, కర్రి రాజారావు పాల్గొన్నారు. మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్ ఆధ్వర్యంలో 31వ డివిజన్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. చల్ల పార్వతి, సత్య, నక్క జ్యోతి, రేలంగి లక్ష్మి, కనకం, దుర్గ, సత్యవతి, నిర్మల, రమణ, భ్రమరాంబ పాల్గొన్నారు.

గాంధీ జయంతి పురస్కరించుకుని అక్టోబర్ 2నకాకినాడ భానుగుడి జంక్షన్ వద్ద నుండి మెయిన్ రోడ్డు వరకు పాదయాత్ర చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు. జ్యోతుల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్ఎలు జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, ఎస్‌విఎస్ఎన్.వర్మ, టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు తదితరులు జిల్లా ఎస్పీ సతీష్‌ను కలిసి వివరాలు తెలియజేశారు. కాకినాడ రూరల్ మండలం వలసపాకలలో కాకినాడ రూరల్ టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి రిలే నిరాహారదీక్ష చేపట్టారు. బోళ్ల కృష్ణమోహన్, మిరపల ప్రకాష్, తాతపూడి రామకృష్ణ, సరిదే నాగ హరినాథ్, పేరాబత్తుల లోవబాబు, మట్టా ప్రకాష్ గౌడ్, బావిశెట్టి శ్రీను, పిల్లి రామకృష్ణ, కేశబోయిన ఏడుకొండలు, పలివెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో..

కాకినాడ రూరల్‌లో..

బోట్ క్లబ్ అర్బన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడ బోట్ క్లబ్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతికి నిరంతరం పాటుబడుతున్నరన్నారు. మహిళా సంఘాల సహకారంతో మహిళలే విక్రయిస్తున్న ఈ అర్బన్ మార్కెట్ ద్వారా వారు మరింతా బలోపేతం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఒ కృష్ణ మోహన్, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, కూడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి కుమార్, ఎఎంసి చైర్మన్ పసుపులేటి వెంకట లక్ష్మి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న విద్యా సాగర్, ఎంపిపి జి.పద్మజ బాబ్జీ, ఐ.శ్రీను, బెండ విష్ణు మూర్తి, వాసిరెడ్డి సూరిబాబు, పాటి సూరిబాబు, జంగా గగరిన్, శర్మ పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

గండేపల్లి : గండేపల్లి, సూరంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల అన్ని సెక్రటేరియట్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని గండేపల్లి, సూరంపాలెం వైద్యాధికారులు డాక్టర్ ఐ.సౌమ్య, డాక్టర్ షారోన్ కీర్తన తెలిపారు. అన్ని గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. గండేపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుంన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఒపి సేవలు, పలు వ్యాధులకు చికిత్స, రిఫరల్ సేవలు, ఆరోగ్యశ్రీ సేవలు, పిల్లల వ్యాధి నిపుణులు, ఎముకల వ్యాధి నిపుణులు, ప్రసూతి వ్యాధి నిపుణులుచే వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

కార్టూ'నిజం'



మంచి అలవాట్లతో గుండె వ్యాధులు దూరం

మంచి ఆహారపు అలవాట్లతో గుండె వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని పలువురు వైద్య నిపుణులు సూచించారు. ప్రపంచ గుండె వ్యాధుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కార్పొరేషన్ సూర్య గ్లోబల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బిహెచ్‌పిఎస్.వీర్రాజు ఆధ్వర్యాన మాధవపట్నంలోని హాస్పిటల్ ప్రాంగణం నుండి కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న ప్రపంచ గుండె ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. రోజురోజుకూ గుండె జబ్బులు పెరుగుతున్నాయని, చిన్న పెద్ద, స్త్రీ పురుష తేడా లేకుండా గుండె జబ్బులు వస్తున్నాయన్నారు. ఆహార నియమాలు, దురలవాట్లు, అధిక ఒత్తిడి, వంశపారంపర్యంగాను గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. సరైన వ్యాయామం లేక పోవడం, జీవన శైలి మారిపోవడం కూడా ఒక కారణం అవుతోందని, బిసి, సుగర్ వ్యాధులు కూడా ఒక కారణంగా నిలుస్తున్నాయన్నారు. మసాలాతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తుతాయని, తద్వారా గుండె జబ్బులకు కారణం అవుతుందన్నారు. వ్యాయామం చేస్తూ తగిన వైద్య సలహాలు పాటిస్తే గుండె వ్యాధులకు అవకాశం లేదన్నారు. గుండె జబ్బులు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. యోగా, మెడిటేషన్, ఆహార నియమాలు పాటించాలని హాస్పిటల్ ఛైర్మన్ డా.వీర్రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో డైటీషియన్ వరలక్ష్మి, డాక్టర్ ఎస్.ఎన్.పండు, డాక్టర్ వి.ఆదినారాయణ, డాక్టర్ శ్రీనివాస్, సూర్యనారాయణ, పర్యవేక్షకులు రాజా, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** సర్పవరం జంక్షన్ నుంచి ట్రస్ట్ ఆసుపత్రి వరకు వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పాల్గొని జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ హదయ దినోత్సవం అంటే హదయాన్ని రక్షించుకునే అంశంపై అవగాహన కల్పించడం కోసం జరుపుకుంటామని, గుండె ఆరోగ్యానికి మంచి జీవనశైలిని ప్రోత్సహించడమే ప్రపంచ హదయ దినోత్సవ ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ గవర్నర్ దత్త సుబ్బారావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ వైడి.రామారావు, ట్రస్ట్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.కళ్యాణ్ చక్రవర్తి, ఆండాళ్, ఇడి డాక్టర్ ఎస్‌సిహెచ్.రామకృష్ణ, కార్డియాలజిస్టులు డాక్టర్ నిషాంత్, డాక్టర్ పవన్, డాక్టర చంద్రమౌళి, డాక్టర్ యు.రామకష్ణ, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డాక్టర్ ఆదిత్య, రవికృష్ణ, ఉదయభాను పాల్గొన్నారు. **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. రంగంపేట మండలం సుభద్రంపేటలో ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లతో గుండె వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.శృతి, గ్రామ సర్పంచ్ కె.సాయి తాతారావు, జెడ్‌పిటిసి పి.రాంబాబు, పి.దుర్గా ప్రసాద్, పి.సుబ్బరాజు పాల్గొన్నారు.

పాఠశాల భవనం, ఆర్ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-తొండంగి (అన్నవరం)

తొండంగి మండలంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని, కొత్త ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను అరబిందో అధికారులు శుక్రవారం ప్రారంభించారు. కొత్త పెరుమాళ్ళపురం పంచాయతీ పరిదిలోని గడ్డిపేటలో సుమారు రూ.30 లక్షల నిధులతో నూతన పాఠశాల భవనం, తలపంటిపేట గ్రామంలో మరో రూ.10 లక్షల వ్యయంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌జెడి నాగమణి, జిల్లా డిప్యూటీ విద్యా శాఖాధికారి దాట్ల సుభద్ర, ఎంపిపి తొండంగి సువర్ణలత, వైస్ ఎంపిపి నాగం గంగాధర రావు, లైఫిస్ ఫార్మా ప్రతినిధి ఎన్.రవికుమార్, కాకినాడ సెజ్ జిఎం మంథా శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. రూ.40 లక్షలతో భవనం, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్, అరబిందో ఫార్మా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ వైస్ ఛైర్మన్ కె.నిత్యానంద రెడ్డి, అరబిందో ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ పి.శరత్ చంద్రారెడ్డికి స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపి మండల అధ్యక్షునిగా గోవిందకుమార్

ప్రజాశక్తి - తాళ్లరేవు

వైసిపి మండల అధ్యక్షులుగా కాదా గోవింద కుమార్ రెండవసారి నియమితులయ్యారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ద్వారా తనకు నియామక పత్రం అందినట్లు గోవింద కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లరేవులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

మడమ తిప్పని హరిత సంరక్షణ

జిల్లాలో స్వామినాథన్ జ్ఞాపకాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉమ్మడి తూర్పు గోదావరితో ఎంఎస్ స్వామినాథన్‌కు విడదీయరాని బంధం ఉంది. ముఖ్యంగా మడ అడవుల సంరక్షణలో ఆయన విశేష కృషి చేశారు. 1996లో ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన తుపాను కారణంగా కాకినాడ తీరం, మచిలీపట్నంలో ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ బ్రాంచ్ స్థాపించి మడ అడవుల సంరక్షణ కోసం కెనడా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. 900 హెక్టార్లలో అటవీశాఖ, మత్స్యశాఖ, ప్రజల భాగస్వామ్యంతో మడ అడవులను అభివృద్ధి చేశారు. సముద్రమట్టం పెరిగితే కోస్తా ప్రాంతంలో నీరు ఉప్పగా మారిపోయేది. ఫలితంగా వరిపంట నాశనమయ్యేది. మడ అడవుల్లో సైతం ఉప్పు శాతం పెరిగిపోతుండటంతో ముందుగా గ్రహించిన స్వామినాథన్ పోర్ట్ రేషియా ఫైలాప్థియా అనే గడ్డి మొక్క నుంచి జీన్స్ తీసి, బయోటెక్నాలజీ ద్వారా ఉప్పు శాతం తట్టుకునే వరి వంగడాల మొక్కలను సృష్టించేందుకు అంకురార్పణ చేశారు. ఆయన నెలకొల్పిన ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ ద్వారా నేటికీ నూతన వంగడాల కృషి జరుగుతుందని ఫౌండేషన్ శాస్త్రవేత్త లు సుబ్రహ్మణ్యం, రవిశంకర్ తూపల్లి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తడ నుంచి ఇచ్ఛాపురం వరకు మడ అడవుల సంరక్షణ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హయాంలో ప్రభుత్వం జిఒ జారీ చేసింది. అంతరించిపోతున్న సిఫ్ ఫోరా హైడ్రో ఫిలేసియా(కాఫీ జాతి మొక్కలు) అనే అరుదైన మొక్క మడ అడవుల్లో అంతరించిపోతుంది. ఆ మొక్కను సంరక్షించాలని ఆయన కృషి చేశారు. ప్రస్తుత కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ దిండి గ్రామం, చొల్లంగి పంచాయతీ కొబ్బరి చెట్టు పేట ప్రాంతాల్లో సెల్ఫ్ హెల్ప్ గ్రూపు (మహిళా సంఘాలకు) రుణాలు ఇప్పించి మడ అడవుల సంరక్షణ కోసం మహిళలు కృషి చేసేలా ఇండ్ల లోనే మడమొక్కలను పెంచి వాటిని మడ అడవుల్లో నాటే విధంగా శిక్షణ ఇచ్చారు. నేటికీ ఇవి పనిచేస్తున్నాయి. ఆయన మృతితో ఈ గ్రూపు సభ్యులు సంతాపం తెలిపారు. ఆయన మరణించినప్పటికీ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని వారంటున్నారు.

మట్టపాలెంలో అభివృద్ధి చేసిన మడ నర్సరీ

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-నల్లజర్ల

భార్యాభర్తల మధ్య వివాదాల నేపథ్యంలో మహిళ కాల్వలో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చింది. నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం అక్కుపల్లిలోని గోకవరం గ్రామానికి చెందిన నెరుసు శ్రీనివాస్‌కు తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కొవ్వూరుకు చెందిన కస్తూరి(25)తో ఆరు నెలల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కస్తూరిని కొవ్వూరులోని తల్లిదండ్రుల వద్ద దించేందుకు శ్రీనివాస్ బైకుపై ఎక్కించుకుని బయలుదేరాడు. నల్లజర్ల వైపు నుంచి కొవ్వూరు వైపు వెళ్తుండగా పోలవరం కుడి కాలువ వంతెన దాటేసరికి బైకు ఆపమని కస్తూరి భర్తను కోరింది. బండి ఆపగానే పరుగెత్తుకువెళ్లి వంతెనపై నుంచి కాలువలోకి దూకేసింది. గమనించిన భర్త శ్రీనివాస్ వెళ్లే సరికి ఆమె గల్లంతైంది. శ్రీనివాస్ నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి అయినా కస్తూరి ఆచూకీ దొరకలేదు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

22 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

కడియం మండలంలోని వేమగిరి గ్రామ శివారు 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఏడుగురుని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. డిఎస్‌పి కె.శ్రీనివాసులు శుక్రవారం కడియం పోలీస్ స్టేషన్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఒడిశాకు చెందిన బిపాడ బంజన్ పాణిగ్రహి, కడియపులంకకు చెందిన మంగ పట్టాభి, ఐ.మణికంఠ, బుర్రిలంకకు చెందిన బేహరా చంద్రశేఖర్, పొట్టిలంకకు చెందిన నాగిరెడ్డి దుర్గాప్రసాద్, వంగా శివరాం, వీరవరానికి చెందిన కొత్తపెళ్లి అయ్యప్పలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి గంజాయతో పాటు ఆరు సెల్‌ఫోన్లు, ఒక బైకును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రాణిగ్రహం నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా చేసి అమ్ముకుంటామని విచారణలో నిందితులు తెలిపారన్నారు. వీరిపై కడియం సిఐ పివిజి.తిలక్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నారనానరు.

పాము కాటుకు గురైన బాలిక మృతి

ప్రజాశక్తి -కరప

వాకాడ గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలిక పాము కాటుకి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వాకాడకు చెందిన బొంతు నాగరాజు కుమార్తె మానసదేవి ఈ నెల 28న ఇంట్లో పుస్తకాలను సర్దుతుండగా చేతిపై గుర్తుతెలియని పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రంగవల్లి నగర్‌కు చెందిన కిలాని అప్పారావు(68) పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడని హెచ్‌సి రామకృష్ణ తెలిపారు. ఈ నెల 28న అప్పారావు చికెన్ కోసం రామవరం వెళ్లాడు. తిరిగి వస్తుండగా బూరుగుపూడి నుంచి జగ్గంపేట వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హైవే పోలీసులు అతన్ని జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ జిజిహెచ్‌కు తీసుకెళ్లారు. మతుని భార్య పాపయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సి తెలిపారు.

ఆదిత్య విద్యార్థులకు సిపిఆర్‌పై శిక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కాకినాడ మెడికవర్ హాస్పిటల్ వారిచే విద్యార్థులకు వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సిపిఆర్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో 500 మంది విద్యార్థులకు గుండె వ్యాధులపై అవగాహన, సిపిఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సిపిఆర్‌పై ఇచ్చే ఈ శిక్షణ ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్ ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ విజెసిహెచ్.ప్రకాష్ మాట్లాడుతూ ఒత్తిడికి లోనవ్వకుండా, క్రమశిక్షణతో కూడిన ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి మంచివని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జి మూర్తి, మెడికవర్ హాస్పిటల్ మేనేజర్స్ జి.శివప్రసాద్, బి.అభిలాష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ తేజేశ్వరరావు, దివాకరరావు పాల్గొన్నారు.

ఓర్పు అంటే బలమైన లక్షణం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఓర్పు చూపించడం అంటే బలహీనత కాదని, అది ఒక బలమైన లక్షణమని యెహోవా సాక్షుల సమావేశం ఛైర్మన్ ఎస.సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం నడకుదురు రోడ్డులోనిస్థానిక కుసుమ సత్య కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓపికతో ఉంటే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కన్వెషన్ కమిటీ సభ్యుడు పి.కుమార్ రాజా పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - తాళ్లరేవు

త్వరలో రానున్న దసరా ఉత్సవాలకు తాళ్ళరేవు కేశవ స్వామి కాలనీలో విజయ దుర్గ గుడి వద్ద ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అక్టోబర్ 24న విజయదశమిని పురస్కరించుకొని ముందుగా శుక్రవారం పందిరి రాట వేశారు. అక్టోబర్ 15వ తేదీ నుంచి దేవీ నవరాత్రులు ప్రారంభమవుతాయని వేద పండితులు మర్ల హరిబాబు తెలిపారు. దంపతులు గేదెల సాయి సత్యనారాయణ, నాగలక్ష్మి, గ్రామ ప్రజలుపాల్గొన్నారు.

ఆదిత్య ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తమ దత్తత గ్రామం పెద్దాపురం మండలం కొండపల్లి గ్రామంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అందరూ పచ్చదనం – పరిశుభ్రత ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు కషి చేయాలనీ, స్వచ్ఛత హి సేవా కార్యక్రమం ద్వారా మహాత్మా గాంధీ కలలు ఫలించేలా గ్రామాలను అభివద్ధి పథంలో నిలపాలని పిలుపునిచ్చారు. గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫణికుమార్, మలకల రమణ, ఉపాధ్యాయ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.రాంబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాల్టీలో 200 మంది ఉద్యోగులు, కార్మికులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ పుష్కర ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఆధ్వర్యంలో, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రారంభించారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు డయాబెటిస్ పరీక్షలు నిర్వహించి, అవగాహన సదస్సు విజన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహోన్నత్ నిర్వహించారు. కాకినాడ పుష్కర క్లబ్ నుంచి శ్రీనివాసు, తలారి రామచంద్రరావు, సామర్లకోట క్లబ్‌కు చెందిన ఉప గవర్నర్ ఈదల ఈశ్వర కుమార్, జిల్లా చైర్మన్ చిత్తులూరి వీర్రాజు (రాజా), గుండు శంకర్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్న కార్మికులు మొదట వారి ఆరోగ్యాన్ని కాపాడు కోవాలన్నారు. మీరు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణ ప్రజలకు సేవలు అందించ గలుగుతారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, వైసిపి నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అధికారులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

7వ అదనపు జిల్లా జడ్జిగా చంద్రమౌళీశ్వరి

పెద్దాపురం: పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జిగా జి చంద్రమౌళీశ్వరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గుంటూరు నుంచి బదిలీపై పెద్దాపురం వచ్చారు. ఇప్పటివరకు 7వ అదనపు జిల్లా జడ్జిగా కాకినాడ 6వ జిల్లా జడ్జి నికితా ఆరోరా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

సామర్లకోట రూరల్ : వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం ద్వారా లబ్ధిదారుల ఖాతాలోకి డబ్బులు జమ కావడంతో సామర్లకోట భాస్కర కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో సిఎం చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ పాల్గొని ప్రసంగించారు.

జగనన్న సురక్ష ట్రైల్ క్యాంపు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

జగనన్న ఆరోగ్య సురక్ష ట్రైల్ క్యాంప్‌ను శుక్రవారం వి.కె.రాయపురం జెడ్‌ఎ హెచ్‌ఎస్ స్కూల్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. ఈ నమూనా క్యాంప్‌లో ఎంపిడిఒ డి.శ్రీలలిత, తహశీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి, ఇఒపిఆర్‌డి కె.హరి కృష్ణ సత్యారెడ్డి, వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.ప్రశాంత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వై శ్రీహరి, నాయకులు తలారి దొరబాబు, ఊటా వాసు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఇద్దరికి ఎఎస్ఐలుగా ప్రమోషన్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న యానాంకు చెందిన ఇద్దరికి ఎఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ శుక్రవారం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆర్ ఏలుమలై ఆదేశాలు జారీ చేశారు. యానాం స్టేషన్‌లో జిల్లెళ్ల ప్రభాకరరావు, దయ్యాల ప్రకాశరావు పుదుచ్చేరిలో విధులు నిర్వహిస్తున్నారు. వారు డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో పదోన్నతులు పొందారు.

రోడ్ల పనులు పూర్తి చేయాలని వినతి

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని కనకాలపేట ధనలక్ష్మి నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ యానాం ప్రెసిడెంట్ అల్లాడి దినేష్, నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, రాము రాజు మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాశం కు శుక్రవారం విన్నవించారు. సావిత్రి నగర్‌లో శ్మశాన వాటిక పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

బాపనయ్య నాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

మేయర్‌గా పనిచేసిన బెజవాడ బాపనయ్య నాయుడు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాశం, ఎస్ఐ శివ సూకరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాపనయ్య నాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జిజిహెచ్ వద్ద వ్యాన్‌లో మంటలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ సామాన్య ఆసుపత్రి సమీపంలో మారుతి వ్యాన్‌లో మంటలు చెలరేగిన ఘటన శుక్రవారం సంచలనం రేపింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి చెందిన వీర్రాజు వివిధ పేపర్లతో తెల్లవారుజామున కాకినాడ చేరుకున్నారు. ఉదయం సుమారు 9.30 గంటల ప్రాంతంలో వీర్రాజు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మారుతి వ్యాన్ పక్కన నిలిపి కిందికి దిగారు. కాసేపటికే కారులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో స్థానిక అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే కారులో మంటలు చెలరేగాయని అగ్ని మాపక సిబ్బంది తెలిపారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో ప్రతిభ పాఠశాల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో సామర్లకోట ప్రతిభ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనపరిచి రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ ముందుండి అత్యంత ప్రతిభను కనపరుస్తున్నట్లు చెప్పారు. తాజాగా కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఈ వినీల్ కృష్ణ, ఎన్.సూర్యచరణ్ అండర్ –17 ఫుట్ బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్ –14 మండల స్థాయి కబడ్డీ పోటీల్లో సిహెచ్.శివ, బి.హేమంత్, టి.సాయి దీపక్, కె.సూర్య, కె.జాయ్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్ –17 కబడ్డీలో బి.శ్రీనివాస్, డి.వివేక్ జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక కాగా అండర్ –17 ఖోఖోలో కె.కృష్ణ, కె.శ్రీనివాస్ ఎంపికైనట్లు తెలిపారు. అథ్లెటిక్స్ అండర్ –14 విభాగంలో 200 మీటర్ల రన్నింగ్ పోటీల్లో కె.శ్రీవల్లి, జి.తేజ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

సుబ్బారావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఆలమూరు

గుమ్మిలేరు, మోదుకూరు గ్రామాల క్లస్టర్ కార్యదర్శిగా చేస్తూ ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి పొందిన సుబ్బారావు సేవలు ప్రశంసనీయమని ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, ఎంపిడిఒ కె.జాన్ లింకన్ కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయంలో సహోద్యోగులైన కార్యదర్శుల ఆధ్వర్యంలో శుక్రవారం సుబ్బారావుకు అభినందన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఈయన కొత్తపేట మండల ఇఒపిఆర్‌డిగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో విధులకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ రామ స్వరూప్, ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, ఎఎంసి ఛైర్మన్ యనమదల నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి తోరాటి రాంబాబు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత'పై విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇండియన్ స్వచ్ఛత లీగ్‌లో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు 'స్వచ్ఛభారత్‌లో నా వంతు పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖను పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సానిటరీ సెక్రటరీలు దుర్గాప్రసాద్, రమణ, వరప్రసాద్, జయరాం, హైమా, ప్రత్యూష, భవాని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.సురేంద్ర మాట్లాడుతూ ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ ధ్వంసంలో ప్లాస్టిక్ ప్రభావం వంటి అంశాలపై ఈ పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న బహుమతులు అందజేస్తామన్నారు.

గోవిందపురంలో మహిళా శక్తి రథయాత్ర

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గోవిందపురంలో మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా శక్తి రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాశక్తి మహిళలు గ్రామంలో తిరుగుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఈ ప్రభుత్వం జగన్ రెడ్డి అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. రాబోయే టిడిపి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమం అందించాలని ఉద్దేశంతో మేనిఫెస్టోను విడుదల చేశారన్నారు. అనంతరం చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉన్న పథకాల గురించి ప్రజలకు వివరించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. అక్టోబర్ లోనిర్వహించే జిల్లా స్థాయి జాతీయ బాలల 31 వ సైన్స్ కాంగ్రెస్ కు సంబంధించిన సన్నద్ధత శిక్షణ కార్యక్రమం డివిజన్ స్థాయిలో సైన్స్ ఉపాధ్యాయులకు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థి స్థాయి నుంచే పిల్లల్లో శాస్త్రీయ వైఖరులను అలవర్చడానికి అనేక కార్యక్రమాలునిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఓరియంటేషన్ నిర్వహిస్తారు. డివిజన స్థాయిశిక్షణకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉప విద్యాశాఖ అధికారి శ్రీపాద ఫణిబాలలక్ష్మీనారాయణ హాజరయ్యారు. విద్యార్థి స్థాయి నుంచి శాస్త్రీయ పరిశోధనల వైపు విద్యార్థులను మరల్చగలిగితే ఎందరో స్వామినాథన్ లు, సివి రామన్ లు తయారవుతారని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారులు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో కొన్ని నెలలుగా అనేక శాస్త్రీయసంబంధమైన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు అందించే ప్రాజెక్టులను తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు .జిల్లా సైన్స్ అధికారి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అక్టోబర్ చివరి వారంలో జిల్లాస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తామన్నారు. పాఠశాల హెచ్‌ఎం వీర రాఘవ రెడ్డి, జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ బ్రహ్మానందం , జిల్లా రిసోర్స్ పర్సన్ లు కేశన కుర్తి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి ఉచిత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-అమలాపురం

సఫాయి మిత్ర సురక్ష సివిర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమలాపురం పురపాలక సంఘం పరిధిలోని పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అమలాపురం పురపాలక సంఘం ప్రాంగణంలో నిర్వహించిన సఫాయి మిత్ర సురక్ష సివిర్ క్యాంపును మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, కమిషనర్ వావ్మోలు ఐపిఐ.నాయుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారుగా 150 మంది శానిటేషన్ వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.నిహారిక, మెడికల్ సిబ్బంది, మున్సిపల్ ఇంజినీర్ కె.వెంకటేష్, శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీస్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశపు హాలులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వ్యవస్థ నిర్మూలనపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను తదుపరి రాష్ట్రాన్ని బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్ష అని పేర్కొన్నారు. మండల స్థాయి లో తహశీల్దార్, సబ్ ఇన్‌స్పెక్టర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌తో చట్టం అమలుకు కమిటీని నియమించాలని ఆదేశించారు . నిబంధనలకు విరుద్ధంగా వివాహాలు చేస్తే రెండు సంవత్సరాలు జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా విధిస్తామని, అంతేగాక వారి తల్లిదండ్రు లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల్యవివాహాలు చేయడం వలన కలిగే రక్తహీనత బాల్యంలో గర్భధారణ వల్ల కలిగే నష్టాలు గురించి వారికి అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల కట్టడితో మాతా శిశు మరణాలు తగ్గించి ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు అందరూ ముందడుగు వేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని సచివాలయ పరిధిలో మహిళా పోలీస్ సహకారంతో రిజిస్టర్ మెయింటైన్ చేసి తప్ప కుండా పెళ్లిళ్ల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరిపిస్తే అందుకు సహకరించిన వారందరిపై కేసులు నమోదు చేయాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విఐపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భవ'తో ప్రజల వద్దకే వైద్య సేవలు

ప్రజాశక్తి-మండపేట

వైద్యసేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భవ' పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో అభివృద్ధి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

కమిటీ సభ్యులు వై.వెంకట్రాజు, కొల్లి వరలక్ష్మి, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-మండపేట

తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రిన్సిపల్ యెస్‌వి.ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక యెస్ వియెస్ఆర్.ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులకు సంబంధించిన మూడు నెలల హాజరు, యూనిట్ పరీక్షల మార్కులు వారికి అందజేశారు. అ సమావేశంలో అధ్యాపక, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

ప్రజాశక్తి-అమలాపురం

విజిలెన్స్ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కలిసి రెండు బందాలుగా ఏర్పడి పలు శుక్రవారం జిల్లాలో పార్శిల్ ఆఫీసులను తనిఖీలు నిర్వహించారు. అమలాపురం పట్టణములోని పట్టాభి రామ లారీ సర్వీస్ ను తనిఖీ చేయగా, ఆ ఆఫీసు నందు విజయవాడ నుంచి అమలాపురానికి వచ్చిన 5పార్శిల్స్‌కు సంబధించిన వాటికి సరైన పత్రములు బిల్లులు సమర్పించనందున సుమారు రూ.86,853 విలువ గల సరుకులను నిలుపుదల చేశారు. తదుపరి చర్య నిమిత్తం డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్, వాణిజ్య పన్నుల శాఖ వారికి అప్పగించారు. అమలాపురం పట్టణములోని ఎపిఎస్ఆర్‌టిసి పార్శిల్స్ ఆఫీసును తనిఖీ చేయగా, సదరు ఆఫీసు నందు గల 6 పార్శిల్స్‌కు సంబధించిన వాటికి సరైన పత్రములు బిల్లులు సమర్పించ నందున సుమారు రూ.4,63,578 విలువ గల సరుకులను నిలుపుదల చేసి తదుపరి చర్య నిమిత్తం వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి ముత్యాలు నాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మినారాయణ కానిస్టేబుల్స్ వలీ, కిషోర్, లోవ కుమార్ , వీరబాబు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా జాయింట్ కలెక్టర్ కు మహిళా రిజర్వేషన్ అమలుచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారుకార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరావు, ఎఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పిసిసి డెలిగేట్స్ మాచవరపు శ్రీమన్నారాయణ, దోనిపాటి విజయలక్ష్మి, మండల అధ్యక్షులు రాయుడు వెంకటరమణ, పట్టణ నాయకులు వంటెద్దు బాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అన్నారు. శుక్రవారం అంగర పిహెచ్‌సిలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

ఏడిద సీతానగరంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి-మండపేట

ఏడిద సీతానగరంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ వంశీ మాట్లాడుతూ ప్రభుత్వం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో అందిస్తున్న వైద్య సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌బి, ఆర్‌బియెస తదితర 15 రకాల ఉచిత పరీక్షలతో మందులు ప్రభుత్వం అందజేస్తారన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు నీటి నిల్వలు ద్వారా వ్యాపిస్తాయని ఎప్పటికప్పుడు నీటి నిల్వ లేకుండా చూసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు, ఆల్ అవుట్ తదితర పరికరాలు వినియోగించుకోవాలన్నారు. ఈగలు వాలిని పదార్థాలను తినరాదన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.ఎ.నెం. 70/2022, ఇ.పి.నెం. 35/2019
ఓ.ఎస్.నెం. 128/2015

బిట్వీన్:
నల్లా ప్రసాదరావు **...పిటీషనరు /డి. హెచ్. ఆర్**
మరియు
గుత్తుల సూర్యనారాయణ (డైడ్) మరియు 1 అదర్
...రెస్పాండెంట్లు /జె.డి.ఆర్స్
2) కుడుపూడి ధనలక్ష్మి, భర్త: వీరవెంకట సత్యనారాయణ, ఇంద్రపాలెం, కాకినాడ.
...రెస్పాండెంటు / ప్రపోజ్డ్ 2వ జె.డి.ఆర్

ఈ నెంబరులో చనిపోయిన 1వ జె.డి.ఆర్.కు మిమ్ములను వారసులుగా చేర్పించమని దాఖలు చేసిన పై నెంబరు పిటీషనులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ తీసుకోనందున కోర్టు వారు పబ్లికేషను ద్వారా నోటీసులు ఆర్డరు వేసినారు. సదరు పిటీషను వాయిదా **ది.09-10-2023 అయి ఉన్నది. కావున సదరు తేదీని పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:30 ని॥లకు స్వయం గా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మనవి చేసుకోవలెను.** లేనిచో పిటీషను పరోక్షమందు తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

శ్రీ ఎన్.వి.కె. శర్మ, అడ్వకేట్,
అమలాపురం. సెల్: 98491 42007

మహారాజ శ్రీ కర్నూలు ఏడవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

M.V.O.P No. 240/2023

వి.సునీల్‌కుమార్. ...అర్జీదారు
-Vs-
ఆశిక్ ముమ్మిడి వగైరా. ...రెస్పాండెంట్లు

మొదటి రెస్పాండెంటుకు నోటీసులు

ఆశిక్ ముమ్మిడి తండ్రి యం. ధర్మయ్య,
కారు డ్రైవరు మరియు ఓనరు,బేరింగ్
నెం.కెఎ.36యన్5855, ఇంటి.నెం.2-46,
ప్లాటు నం.26,శ్రీవిధ్యకాలనీ,
వెంకటనగర్, కాకినాడ.

పై నంబరు M.V.O.P లో అర్జీదారు అయిన వి.సునీల్‌కుమార్ రోడ్డు ప్రమాదములో తనకు జరిగిన గాయములకు నష్టపరిహారం రూ.4,00,000/-లు, ఇందుపైన ప్రమాదం జరిగిన రోజు నుండి 12% ప్రకారం వడ్డీ మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జీదాఖలు చేసినాడు. ఇందులో మొదటి రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 01-11-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 01-11-2023

బి.సి.శేషన్న
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజశ్రీ 4వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 929/2022

Between:
Mohammad Abdul Thameem, S/o. Mohammad Abdul Khadar, Muslim, aged 59 years, R/o. D.No. 28-12-10, Qureshi Road, Jampeta, Rajamahendravaram, R.Jr.C.J.C. ***...Plaintiff***
AND
Ghanshyam Changani, S/o. G.Vatram, Hindu, aged 55 years, D.No. 78-14-29, A.V.Appa Rao Road, Syamala Nagar, Rajamahendravaram, R.Jr.C.J.C.
...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 16-10-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **జి.కృష్ణ కపూర్**
29-9-23 అడ్వకేట్, రాజమండ్రి

ప్రకటన

మా క్లయింట్లు అయిన కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, గంగనాపల్లి గ్రామ కాపురస్తులు అయిన **1) పితాని సంతోష్ కుమార్, S/o. పి. వెంకటరత్నం మరియు 2) బూరవిల్లి కేళిమానస, W/o. పితాని సంతోష్ కుమార్ గార్లు** మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.

మా క్లయింట్లు కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, ఇంద్రపాలెం కాపురస్తులు (లేటు) కట్టమేను గంగారావు గారి భార్య కట్టమేను పాదాలమ్మ వగైరాలు ఈ క్రింది ఉదహరించిన షెడ్యూల్ ఆస్తి అనగా వారి తాలూకు పూర్వార్జితపు ఆస్తి అయి ఉండియున్నది మరియు వారి యొక్క పేర్లుపై గంగనాపల్లి గ్రామ పంచాయితీలో ఉన్న సర్వే నెం. 34-2బిలో య. 0-15 ట్లు భూమిపై పట్టాదారు పాస్ పుస్తకంలు కాకినాడ రూరల్ మండలం తహశీల్దారు వారు ఇచ్చియున్నారు. మా క్లయింట్లు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేసుకొనుటకు ఏర్పాటు చేసుకొనుచున్నారు. కావున యావన్మందికీ తెలియజేయునది ఏమనగా ఈ ఆస్తి కొనుగోలు విషయంలో ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజులులోపు ఈ క్రింది ఉదహరించిన చిరునామాకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. తదుపరి వచ్చు అభ్యంతరములు ఏమియూ మా క్లయింట్లును బైండు చేయనేరవని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూల్

తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ తాలూకా, కాకినాడ రిజిస్ట్రారులో చేరిన గంగనాపల్లి గ్రామ పంచాయితీకి చెందిన గంగనాపల్లి గ్రామం తాలూకు జిరాయితీ పల్లం సర్వే నెం. 34-2బి కు దాఖల య. 0-64 ట్లులో వీరు చెందజేసిన య. 0-15 ట్లు లేక 0.061 హెక్టార్లు భూమికి హద్దులు: **తూర్పు:** కట్టమేను తాతారావు భూమి; **పడమర:** కట్టమేను అప్పన్న గారి భూమి; **ఉత్తరం:** స్వర్ల తాతారావు గారి భూమి; **దక్షిణం:** కొత్తగాల వెంకటేశ్వర్లు గారి భూమి.

సదరు హద్దులు మధ్య స్థలము య. 0-15 ట్లు భూమి అందుల మామూలు మార్గములు, నీటివనరులు, యావత్తు యీజిమెంటు హక్కులు, అందుల సర్వం సహా మా క్లయింట్లుకు విక్రయించి మా క్లయింట్లుకు స్వాధీనం చేయడం కొరకు.

పండు శ్రీనివాసరావు, B.A., B.L.,
అడ్వకేట్, డో.నెం. 2-244/7, రెవెన్యూ కాలనీ,
చీడిగ చీడిగ, కాకినాడ రూరల్ మండలం
ది.29-9-2023 సెల్: 95811 91796